ధర తగ్గిన ఉల్లి.. రైతు కంట కన్నీరు

- మార్కెట్‌లో పడిపోయిన ఉల్లి ధరలు
- కొనుగోళ్లకు ముందుకురాని వ్యాపారులు
- తోటల్లోనే గెనాలపై ఉల్లి గడ్డలు
- నష్టాల బాటలో ఉల్లి రైతులు



తోటల్లోనే గెనాలపై వదిలేసిన ఉల్లి గడ్డలు



కోసిన ఉల్లి గడ్డలను ఆరబెట్టుకుంటున్న రైతులు

వేముల : ఈ ఏడాది ఉల్లి పంటపై రైతులు పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలయ్యాయి. గతనెల రోజులుగా నిలకడగా ఉన్న ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. బయట మార్కెట్‌లో ఉల్లి ధరలు పడిపోవడంతో ఉల్లి పంట రైతు కంట కన్నీరు తెప్పిస్తోంది. సాగులో పెట్టుబడులు పెట్టినా ధరలు నిలకడగా ఉండటంతో ఆదాయం ఉంటుందని ఊహించి రైతులకు ధరలు తగ్గడంతో కొలుకోలేని దెబ్బ తగులుతోంది. తుఫాన్ ప్రభావంతో ఇటీవల వారం రోజులపాటు వర్షాలు పడటంతో ఉల్లిగడ్డలు దెబ్బతింటాయనే ఉద్దేశ్యంతో రైతులు ఒక్కసారిగా ఉల్లి గడ్డలను పీకివేశారు.

భారీగా ఉల్లి సాగులో పెట్టుబడులు :
ఈ ఏడాది ఉల్లి సాగులో భారీగా పెట్టుబడులు అయ్యాయి. ఎకరాకు లక్షలాది రూపాయలు రైతులు పెట్టుబడులు పెట్టారు. ఉల్లి సాగు మొదలు కలుపు తీత, ఎరువులు, నీటి తడులు ఇవ్వడం, సకాలంలో మందులు పిచికారి చేయడం, ఉల్లి గడ్డలు పీకివేయడం, కోయడం తదితర ఖర్చులు పెరిగిపోయాయని రైతులు అంటున్నారు. ఈ సారి పెట్టిన పెట్టుబడులు గతంలో ఎప్పుడు కాలేదని, మార్కెట్‌లో ధరలు ఉండటంతో ఆదాయం వస్తుందనే ఆశతో ఉన్నామని, ఇలా జరుగుతుందని ఊహించలేదన్నారు.

మార్కెట్‌లో పడిపోయిన ఉల్లి ధరలు :
గత నెల రోజులుగా నిలకడగా ఉన్న ఉల్లి ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. వర్షాల కంటే ముందు మార్కెట్ క్వింటా ఉల్లి రూ.3వేల నుంచి రూ.4వేల వరకు ధరలు పలికాయి. ఇటీవల కురిసిన వర్షాల అనంతరం మార్కెట్‌లో ఉల్లి ధరలు తగ్గిపోయాయి. ఉల్లి సాగు పంట కాలం పూర్తయ్యి వర్షాలతో రైతులు ఉల్లి గడ్డలను పీకలేకపోయారు. వర్షాల అనంతరం ఉల్లి గడ్డలు దెబ్బతింటాయనే ఉద్దేశ్యంతో ఒక్కసారిగా పీకివేశారు. వీటిని మార్కెట్‌కు తరలించడంతో ధరలు పడిపోయాయని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం క్వింటా ఉల్లి రూ.1500లకు కూడా అడగడంలేదని రైతులు వాపోతున్నారు.

తోటల్లోనే గెనాలపై ఉల్లి గడ్డలు :
వర్షాలు తెరిపి ఇవ్వడంతో రైతులు ఉల్లిగడ్డలు పీకివేసి గెనాలపై వేశారు. మార్కెట్‌లో ధరలు లేకపోవడంతో ఉల్లిగడ్డలు గెనాలపైనే ఉంచి ఆరబెట్టుకుంటున్నారు. భూమిలో తేమ ఎక్కువగా ఉండటంతో గడ్డలు దెబ్బతినకుండా రైతులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఉల్లి గడ్డలను కొనేవారు లేకపోవడంతో గడ్డలు కోసి ఎక్కడ నిల్వ ఉంచాలో తెలియక గెనాలపైనే వేసుకున్నారు. ప్రస్తుతం ఉన్న ధరలకు ఉల్లిగడ్డలు అమ్మినా కోసే కూలీ ఖర్చులు కూడా రానీ పరిస్థితి ఉంది. దీంతోనే గడ్డలు కోయకుండా తోటల్లోనే గెనాలపై వేసుకున్నామని రైతులు అంటున్నారు. ధరలు వస్తే తప్ప ఉల్లి గడ్డలు కోయలేమని రైతులు చెబుతున్నారు. వర్షాలు ఉల్లి పంటపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. వర్షాల కంటే ముందు ఉల్లి గడ్డలు ఎకరాకు 80 నుంచి 100 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. వర్షాల అనంతరం ఉల్లి సాగులో దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి.

సాగులో తీవ్రంగా నష్టపోతున్నాం



ఉల్లి సాగులో ఈ ఏడాది తీవ్రంగా నష్టపోతున్నాం. వర్షాల ముందు ఉన్న ధరలు వర్షాల అనంతరం పడిపోయాయి. ఉల్లి గడ్డలను మార్కెట్‌కు తరలించినా కొనుగోళ్లకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. ఉల్లిగడ్డలను ఎలా అమ్ముకోవాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. పీకివేసిన ఉల్లి గడ్డలను ఆరబెట్టుకోలేక, అమ్ముకోలేక అల్లాడుతున్నాం.

– చంద్రమోహన్‌రెడ్డి(ఉల్లి రైతు), గొందిపల్లె

ఈ ధరలతో పెట్టుబడులు కూడా దక్కవు



మార్కెట్‌లో ఉల్లి ధరలు నిరాశపరుస్తున్నాయి. ఈ ధరలతో ఉల్లి గడ్డలు అమ్మితే పెట్టుబడులు కూడా దక్కవు. నాకున్న ఏడు ఎకరాలలో ఉల్లి పంట సాగు చేశా. పంట కాలం పూర్తయిన ధరలు వస్తాయని పీకిలేదు. మరో వారం రోజుల్లో ధరలు రాకపోతే గడ్డలు పీకివేసి వదులుకోవాల్సిందే. తుఫాన్ వర్షాలతో ఉల్లి సాగులో నష్టపోతున్నాం.

– చంద్ర ఓబుళరెడ్డి (ఉల్లి రైతు), గొందిపల్లె

క్లుప్తంగా

ఉల్లి రైతులను ఆదుకోవాలి



ఉల్లి రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ఎర్రగుంట్ల : ఉల్లి రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, కాంగ్రెసు పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఇల్లూరు కృష్ణారెడ్డిలు తెలిపారు. ఆదివారం ఎర్రగుంట్ల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న ఉల్లి రైతులను కలసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉల్లి పంటను రైతులు సుమారు నాలుగు మాసాలు కష్టపడి పండించారన్నారు. ఖర్చులు కూడా అధికంగా వచ్చాయన్నారు. తుఫాన్ కారణంగా ఉల్లి పంట దిగుబడి సగానికి పైగా తగ్గిపోయిందన్నారు. టన్ను ధర కూడా భారీగా పడిపోయిందన్నారు. ప్రభుత్వం ఉల్లి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

గంగమ్మతల్లికి విశేష పూజలు



విశేష అలంకారంలో గంగమ్మతల్లి

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లికి ఆదివారం విశేష పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని పట్టు వస్త్రాలతో, పూలమాలలతో విశేష అలంకరణ చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు తగిన సౌకర్యాలను ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. భక్తులు అమ్మవారికి కానుకలను ముడుపులను సమర్పించుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు చేశారు. అలాగే ఆలయ ఆవరణంలోని వీరభద్రస్వామి, సాయిబాబా ఆలయం, శివాలయంలో భక్తులు పూజలు చేశారు.

ముగిసిన భాగవత సప్తాహం

పులివెందుల టౌన్ : పట్టణంలోని గీతామందిరంలో ఏడు రోజులుగా నిర్వహిస్తున్న భాగవత సప్తాహం ఆదివారం నాటితో ముగిసింది. తొండూరు మండలం కృష్ణంగారిపల్లెకు చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు, ఉపన్యాసకుడు వెంకట్రామిరెడ్డి రుక్మిణీ కల్యాణం ఘట్టంపై ప్రవచనం చేశారు. కార్యక్రమంలో భాగవత పండితులు, శ్రీమద్భవగీత ధర్మ ప్రచార సమితి సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం



గోడ పత్రాలను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

వేంపల్లె : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ఏఐటీయూసీ పనిచేస్తోందని జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి కేసి బాదుల్లా తెలిపారు. ఆదివారం స్థానిక జడ్పీ పాఠశాల ఆవరణలో ఈనెల 31న జరిగే ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ గోడపత్రాలను ఆయన విడుదల మాట్లాడారు. కార్మికుల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని వాడవాడలా ఘనంగా నిర్వహించేందుకు కార్మిక శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్మిక హక్కులను సాధించేందుకు పోరాట స్ఫూర్తిని అందించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రామాంజనేయులు, కోశాధికారి నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకేజీతో ఆస్తి నష్టం

వేంపల్లె : వేంపల్లె పట్టణ పరిధిలోని చింతలమడుగుపల్లె గ్రామంలో గ్యాస్ లీక్ అయ్యి రూ.20 వేల ఆస్తి నష్టం వాటిల్లింది. ఫైర్‌స్టేషన్ ఇన్‌చార్జి అధికారి వెంకట సుబ్బయ్య తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గిరిధర్‌రెడ్డికి చెందిన ఇంట్లో గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అక్కడ ఉన్న వంట సామగ్రి కాలి బూడిద అయింది. వెంటనే ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. పైపు కాలం చెల్లడంతో మెత్తపడి గ్యాస్ లీకై మంటలు వచ్చినట్లు వారు తెలిపారు. సహాయక చర్యల్లో ఫైర్ సిబ్బంది సంజీవరెడ్డి, హరిబాబు, శివ కుమార్, జాన్ కుమార్ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

– అదుపు తప్పి కారు బోల్తా

కడప అర్బన్ : కడప నగర శివార్లలో శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో టాటా సుమో కారు వేగం అదుపు కాక బోల్తా పడింది. కారులో వున్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో.. ప్రమాదం త్రుటిలో తప్పింది. రాజంపేట వైపు నుంచి చెన్నూరు వైపు బైపాస్ రోడ్‌లో ఆదివారం రాత్రి వెళుతున్న కారు బోల్తాపడింది. వెంటనే సమీపంలో వున్న కొందరు కారును పైకి లేపారు. కారులో వున్న వారికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

సింహాద్రిపురం : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ చేపట్టారు. రెండు వారాల క్రితం మండలంలోని బలపనూరు గ్రామానికి చెందిన దళితులైన భార్గవ్, తండ్రి వెంకటరమణలపై అదే గ్రామానికి చెందిన గజ్జల చంద్రశేఖర్‌రెడ్డి, గజ్జల చాణిక్యరెడ్డి, చాకలి ఓబులేసు, వడ్డెశేఖర్, మేకల నాగరాజులు కలిసి దాడి చేసినట్లు కేసు నమోదు చేశారు. ఆ కేసు వివరాలను ఎంక్వయిరీ చేయడానికి పులివెందుల డీఎస్పీ మురళినాయక్ బాధితులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే నంద్యాలంపల్లె గ్రామానికి చెందిన ఇరువర్గాల వారిని పిలిపించి మళ్లీ ఘర్షణలకు పాల్పడితే పరిణామాలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. పులివెందుల రూరల్ సీఐ వెంకటరమణ, ఇన్‌చార్జి ఎస్‌ఐ ఎస్ఎండీ షరీఫ్‌లు ఉన్నారు.

అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం

వల్లూరు : వల్లూరులో ఆదివారం పోలీసులు 39 అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో కొప్పోలుకు చెందిన మోపూరి యల్లారెడ్డి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న 39 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు మండల సమావేశం

వేంపల్లె : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సోమవారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కుళ్లాయమ్మ తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు. విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర సమస్యలపై సమావేశంలో చర్చించనున్నారు.

మానవత సేవలు మరింత విస్తరింపజేయాలి

వేంపల్లె : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వివిధ సేవలు మరింత విస్తరింపజేయాలని వైఎస్సార్‌సీపీ యువనేత సింగారెడ్డి తుషార్ నాగిరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో ఏర్పాటు చేసిన మానవత మాసాంతర సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అలాగే మానవత చైర్మన్ బి.చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ సభ్యత్వ నమోదు ఈనెలాఖరులోపు పూర్తి చేసి వచ్చే నిధులను సమాజ సేవకు ఉపయోగపడే విధంగా కృషి చేస్తామన్నారు. మానవత ఉపాధ్యక్షుడు డాక్టర్ యోగీశ్వర్‌బాబు సంస్థకు సంబంధించిన దస్త్రాలు, వస్తువులు భద్రపరిచేందుకు బీరువా అందిస్తామని ప్రకటించారు. సమావేశంలో మానవత సహాయ చైర్మన్ కావలి క్రిష్ణతేజ, కన్వీనర్ రంగారెడ్డి, అధ్యక్షుడు పోతిరెడ్డి శ్రావణ్, కార్యదర్శి శివ, కోశాధికారి శ్రీకళ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

బెల్టుషాపులు పెట్టకుండా దృష్టి సారించాలి

వేంపల్లె : మద్యం సిండికేట్లు బెల్టుషాపులు పెట్టకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి తెలిపారు. ఆదివారం వేంపల్లెలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మద్యం పాలసీ, బెల్టు షాపులపై సీఎం చంద్రబాబు వైఖరి ఉత్తర కుమార ప్రగల్బాలేనని, అరుపులు, ఉత్తుత్తి బెదిరింపులేనని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మద్యం షాపులు పొందిన వారు డబ్బు కోసం సిండికేట్‌గా ఏర్పడి బెల్టుషాపులకు దరఖాస్తులు స్వీకరించి, వేలం, లాటరీ, టెండర్లు వేస్తున్నారన్నారు. కొన్నిచోట్ల దరఖాస్తు ఫీజు రూ.25వేల నుంచి రూ.50వేల వరకు ఉందని, ఒక్కొక్క బెల్టుషాపు నెలకు రూ.50 వేల నుంచి లక్ష వరకు పలుకుతోందన్నారు. దీన్నిబట్టి చూస్తే రానున్న రోజుల్లో మద్యం ఏరులై పారుతుందన్నారు. రాష్ట్రం స్వర్ణాంధ్ర కాదు, మద్యాంధ్ర అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వికసిత ఆంధ్రప్రదేశ్ బదులు విధ్వంసక, వినాశకర ఆంధ్రప్రదేశ్ అవుతుందన్నారు. బెల్టుషాపుల నివారణకు ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

అక్రమ మద్యంపై విస్తృత దాడులు



తొండూరులో మాట్లాడుతున్న ఎస్ఐ పెద్ద ఓబన్న

లింగాల : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఆదివారం పోలీసులు అక్రమ మద్యంపై విస్తృత దాడులు నిర్వహించారు. ఎస్ఐ మధుసూదనరావు ఆధ్వర్యంలో ఉదయం నుంచి కామసముద్రం, కోమన్నూతల, బోనాల, ఎగువపల్లె, దిగువపల్లె, మురారిచింతల, అంబకపల్లె, గుణకణపల్లె తదితర గ్రామాల్లో అక్రమంగా బెల్టు షాపులు నిర్వహిస్తూ మద్యం అమ్ముతున్న వారిపై దాడులు నిర్వహించారు. దీనిపై ఎస్ఐని వివరణ కోరగా ఇదివరకే చాలా గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. పూర్తి వివరాలను సోమవారం వివరిస్తామని ఆయన తెలిపారు.

తొండూరులో..
తొండూరు : గ్రామాల్లో అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పెద్ద ఓబన్న హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దుకాణ యజమానులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతి లేకుండా మద్యం బాటిళ్లను సరఫరా చేసి వాటిని అమ్మడం చట్టరీత్యా నేరమన్నారు. అనుమతి లేకుండా బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల కాలంలో ముఖ్యంగా యువకులు తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థిని లాస్యకు ఆర్థిక సాయం అందిస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం తల్లిదండ్రులు లేని విద్యార్థిని లాస్యకు రూ.5,200ల ఆర్థిక సాయం చేశారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ భవ్య చరిత, రిటైర్డ్ ఎస్‌టీడీటీ తేరా పుల్లారెడ్డి, మానవత జిల్లా ప్రతినిధి చవ్వా కృష్ణారెడ్డిలు హాజరై మాట్లాడుతూ విలువలతో కూడిన సంఘం మానవత సంస్థ అని, సంస్థ అభివృద్ధికి పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. చవ్వా కృష్ణారెడ్డి మానవత సంస్థకు రూ.25వేల నగదును ఇచ్చి శాశ్వత సభ్యత్వాన్ని స్వీకరించారు. మానవత సభ్యులకు సంస్థ అధ్యక్షుడు డి.వి.కొండారెడ్డి అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ ప్రెసిడెంట్ జయరాజు, మానవత సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



అప్పటి ప్రిన్సిపాల్, అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని కడప రోడ్డులో ఉన్న అభిరుచి హోటల్ కల్యాణ మండపంలో ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1997–99 బ్యాచ్ పూర్వపు విద్యార్థులు ఆదివారం సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి పూర్వ విద్యార్థులు అప్పటి రిటైర్డు ప్రిన్సిపాల్ అంకిరెడ్డి, అధ్యాపకులు సాంబశివారెడ్డి, బయపురెడ్డి, కృష్ణయ్యలను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ 25 ఏళ్ల తర్వాత అందరం కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

అప్పటి జ్ఞాపకాలను వారు నెమరువేసుకుని చాలా ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు ఖాజా పీరా, కాటమయ్య చాంద్ బాషా, నాగార్జున, గంగాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో ఆర్ఎస్ఎస్ ర్యాలీ



పులివెందులలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ సభ్యులు



చింతకొమ్మదిన్నెలో శిక్షణ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

పులివెందుల టౌన్ : పట్టణంలో ఆదివారం సాయంత్రం ఆర్ఎస్ఎస్ ర్యాలీ నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ సంఘం ఏర్పాటు చేసి 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100 సంవత్సరాల్లోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా ఈ మహా ర్యాలీని నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఈ ర్యాలీ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా పులివెందులలో నూతనంగా ఏర్పాటు అయిన ఆర్ఎస్ఎస్ కమిటీ మరియు హిందూ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా పూలంగళ్ల సర్కిల్, పార్నపల్లి రోడ్డు మీదుగా నలంద హైస్కూల్ వరకు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు ప్రసంగించారు. అఖండ భారతదేశాన్ని మనం కోల్పోయామని, మనలోని ఐక్యత లేకనే మన దేశాన్ని మనం కోల్పోవడం జరిగిందన్నారు. మనం ఏ మతానికి, ఏ కులానికి వ్యతిరేకం కాదని.. మనమంతా హిందువులమన్నారు. ప్రతి ఒక్కరు ఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో పాల్గొని క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీ గల వ్యక్తులుగా దేశాన్ని సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు.

చింతకొమ్మదిన్నెలో..
వల్లూరు (చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె మండల కేంద్రంలో (ఖండ స్థాయిలో) ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో పథ సంచలన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సంవత్సరంలో నూతనంగా ఆర్ఎస్ఎస్ నుండి శిక్షణ పొందిన వారితో పథసంచలన్(రూట్ మార్చ్) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహక్ ఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పడి 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని శత సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా చింతకొమ్మదిన్నెలో రూట్ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు.

ఇప్పటినుండి 2025 అక్టోబర్ వరకు ఆర్ఎస్ఎస్ ప్రతి గ్రామంలోకి విస్తరించి సేవా కార్యక్రమాలు, పర్యావరణ కార్యక్రమాలు, గో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవాహక్ పగడాల బాలకృష్ణుడు 50 మంది శిక్షణ పొందిన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్ నాయక్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తును పర్యవేక్షించారు.

తుఫాన్‌తో పొగాకు రైతు కుదేలు



అధిక తేమతో రంగు మారిన పొగాకు పంట

పెద్దముడియం : పది రోజుల క్రితం బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో పొగాకు రైతు కుదేలవుతున్నాడు. గతేడాది పొగాకుకు అన్ని విధాలుగా కలిసి రావడంతో దాదాపు మండలంలో 100 ఎకరాల్లో రైతులు పొగాకు పంటను సాగు చేశారు. నారు, నాట్లు, రసాయనిక ఎరువులు, కలుపు నివారణ, క్రిమి సంహారక మందు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ.10 వేల వరకు ఇప్పటికే వెచ్చించారు. అధిక వర్షాల కారణంగా పొలంలో నీరు నిలిచి ఆకులు రంగుమారి ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధిక తేమ శాతం నుంచి పైరును కాపాడుకునే సస్యరక్షణ చర్యలు తెలియజేయాలని రైతులు కోరుతున్నారు.

నందీశ్వరుని భారీ విగ్రహావిష్కరణ



నందిపల్లెలో ఏర్పాటు చేసిన నందీశ్వరుని విగ్రహం

వేంపల్లె : మండలంలోని నందిపల్లె గ్రామంలో నందీశ్వరుని భారీ విగ్రహాని ఆవిష్కరించారు. ఆదివారం నందిపల్లె గ్రామ సర్పంచ్ మారం సులోచనమ్మ చేతు ల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. అనంత రం నందీశ్వరునికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు. నందిపల్లి శివాలయం డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో దాదాపు 6.5 అడుగుల నందీశ్వరుని భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సొసైటీ అధ్యక్షుడు మారం శ్రీకాంత్‌రెడ్డి వెల్లడించారు. నందిపల్లె గ్రామానికి చిహ్నంగా నందీశ్వరుని విగ్రహం ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. మాజీ డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి, సొసైటీ ఉపాధ్యక్షుడు చంద్రఓబుల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామగంగిరెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీరామిరెడ్డి, కోశాధికారి రామలింగేశ్వరరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ



మెమెంటోను అందుకుంటున్న విద్యార్థిని మహిమ

ఎర్రగుంట్ల : జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెకుముఖి పరీక్ష పోటీలలో ఎర్రగుంట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మహిమ ప్రతిభ కనపరిచిందని పాఠశాల ఉపాధ్యాయ బృందం తెలిపారు. ఈ పోటీ పరీక్షలు అనంతపురం జిల్లాలో జరిగాయన్నారు. జేవీవీ రాష్ట్ర నేతల నుంచి మెమెంటోను అందుకుంది.

ఖరీఫ్ కళకళ

పెద్దముడియం : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటలు కళకళలాడుతున్నాయి. మండలంలో దాదాపు 10,000 ఎకరాల పైగా మినుము, వరి, కంది, పత్తి, జొన్న తదితర పంటలను రైతులు సాగు చేశారు. ఆయా పంటల్లో విత్తనాలు, రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వెచ్చించారు. గత వారం తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలు పంటలకు అనుకూలంగా మారడంతో ఆయా పంటల్లో దిగుబడులపై రైతులు ఆశలు పెట్టుకున్నారు.



నెమళ్లదిన్నెగ్రామం వద్ద ఆశాజనకంగా మినుము పంట



గరిశలూరు వద్ద సాగులో ఉన్న వరి పంట



పెద్దముడియం గ్రామం వద్ద కంది పంట



ఉప్పలూరు గ్రామం వద్ద జొన్న పంట